సాక్షి ఒడిశా

సోమవారం । 27 । నవంబర్ । 2023





## ధర్మ్ దియాలీ పర్వ్

జయపురంలో ధర్మ్ దియాలీ పర్వ్ ఘనంగా జరిగింది. కలశ యాత్ర చేశారు.

- 8లో



## కార్తీక శోభ

కార్తీక పౌర్ణమి సందర్భంగా ఆలయాల్లో ఆ శోభ కనిపించింది. వేడుకల్లో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

- 8లో



## ఘనంగా మేరీమాత ఉత్సవం

మేరీ మాత ఉత్సవాలు ఘనంగా జరిగాయి. కొవ్వొత్తుల ర్యాలీ ఆకట్టుకుంది.

- 8లో

## న్యూస్‌రీల్

### కొందమాల్‌లో హై అలెర్ట్



కొందమాల్‌లో మోహరించిన పోలీసు బలగాలు

బరంపురం: కొందమాల్ జిల్లాలో క్రిస్మస్ వేడుకలు ప్రారంభం కాగా.. హై అలెర్ట్ కూడా ప్రకటించారు. మావోల సంచారం భారీ బలగాల కూంబింగ్ మధ్యలో ఇక్కడ క్రిస్మస్ వేడుకలు ప్రారంభమయ్యాయి. 2007, 2008 సంవత్సరాల్లో సరిగ్గా క్రిస్మస్ రోజునే ఇద్దరు స్వాములపై హత్యా యత్నాలు జరిగాయి. దీన్ని దృష్టిలో ఉంచుకుని క్రిస్మస్ రోజుల్లో ఎలాంటి మత కల్లోలాలు జరగకుండా కలెక్టర్ ఆశిష్ ఈశ్వర్ పాటిల్ ఆదేశం ప్రకారం జిల్లా పోలీసు యంత్రాంగం భారీ బలగాలను మోహరించింది. కొందమాల్ జిల్లా గల తుమ్మిడిబొందొ, రైకియా, కటింగియా, టిక్కబల్లి, బుమ్ముణిగ్రాం, బిల్లిగుడా, జి. ఉదయగిరి పట్టణాల్లో నిఘా ఏర్పాటు చేశారు.

### గుప్తేశ్వర్‌లో జోరుగా విదేశీ మద్యం విక్రయాలు



మద్యం బాటిళ్లను ధ్వంసం చేస్తున్న యువకులు

జయపురం: దక్షిణ ఒడిశాలోని ప్రసిద్ధ శైవ క్షేత్రం గుప్తేశ్వర్‌లో కొద్ది రోజులుగా మద్యం విక్రయాలు జోరుగా సాగుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇక్కడ సాటుసారాతో పాటు విదేశీ మద్యం విక్రయాలతో భక్తులు ఇబ్బంది పడుతున్నారు. దీనిపై తాము అధికారులకు ఎన్నిమార్లు తెలిపినా పట్టించుకోవడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో ఈ ప్రాంత యువకులే స్వచ్ఛందంగా మద్యం దుకాణాలపై దాడులు చేస్తున్నారు. అధికారులు తక్షణం చర్యలు తీసుకుని గుప్తేశ్వర్‌లో మద్యం విక్రయాలు నిర్మూలించాలని కోరుతున్నారు.

### ఉపాధ్యాయ సంఘం అధ్యక్షుడిగా నాగరాజు



బొద్దాన నాగరాజును అభినందిస్తున్న సంఘం సభ్యులు

రాయగడ: జిల్లా ప్రాథమిక ఉపాధ్యాయ సంఘం నూతన కార్యవర్గం ఆదివారం ఏర్పాటైంది. సంఘం అధ్యక్షునిగా బొద్దాన నాగరాజు, ఉపాధ్యక్షులుగా హేమంత్ మిశ్రో, ఎ.అరుణ, సాధనా ప్రదాన్, కార్యదర్శిగా బాలకృష్ణ రాజు, సహకార్యదర్శులుగా సురేంద్ర సాహు, నరసింహ సతపతి, వర్కింగ్ కార్యదర్శులుగా ప్రమోద్ కుమార్ పాణిగ్రహి, సురేష్ మిశ్రో, సంజయ్ దాస్, చిత్తరంజన్ చింతాడ, అభయకుమార్ మహాంతి, త్రిపతి గంగులు ఎన్నికయ్యారు. సంఘం మహిళా విభాగం అధ్యక్షురాలిగా హేమలత సాహును ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గానికి పలువురు ఉపాధ్యాయులు అభినందించారు.

### యువజన సంఘం ఏర్పాటు



సంఘంగా ఏర్పడిన కొట్‌పాడ్ సమితి గ్రామాల ప్రజలు

జయపురం: జయపురం సబ్‌డివిజన్ కొట్‌పాడ్ సమితిలో పలు గ్రామల్లోని సమస్యలపై పోరాడేందుకు ఆయా గ్రామాల ప్రజలు సంఘటితమై యువజన సంఘంగా ఏర్పాటు చేశారు. కొట్‌పాడ్‌లో ఆయా గ్రామ యువకులు, పెద్దలు కలిసి మా మవులి యువజన సంఘాన్ని ఆదివారం ఏర్పాటు చేశారు. సంఘానికి అధ్యక్షుడిగా ఉదయ దురువను, సాధారణ కార్యదర్శిగా రామ దురువలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. 15 మంది కార్యవర్గ సభ్యులను నియమించారు. మాజీ కౌన్సిలర్ దేవీ ప్రసాద్ నాయక్, సమాజ్ సేవి మనోజ్ బిశాయి, జగన్నాథ్ గౌడ, చంద్ర దురువ, బుదుర గౌడ, వార్డు మెంబర్ రామ భూమియతోపాటు పలువురు హాజరయ్యారు. పలు గ్రామాల్లో నాలుగేళ్లుగా అభివృద్ధి పనులు జరగటం లేదని, కొన్ని పనులు చేపట్టినా అర్ధాంతరంగా నిలిచిపోయాయని ఆరోపించారు. సమితి గ్రామాలలో తాగునీటి సమస్య అధికంగా ఉందని, విద్యుత్ సమస్యలు పరిష్కారం కావటంలేదన్నారు. ప్రజల సమస్యలపైన సంఘం దృష్టి సారించి, వాటిని పరిష్కరించేందుకు అధికారుల దృష్టికి తీసుకువెళ్తామని వెల్లడించారు.

# బాలి జాతరకు సన్నద్ధం

- నేటి నుంచి జాతర ఆరంభం



బాలి జాతర మైదానం నుంచి ప్రారంభమైన ప్రచార శకటం

భువనేశ్వర్: కటక్ మహానది తీరంలో ఏటా నిర్వహించే బాలి జాతర సోమవారం నుంచి ప్రారంభం కానుంది. ఈ జాతరకు జాతీయ పండగగా గుర్తించాలని అంతా కోరుతున్నారు. జాతీయ గుర్తింపు పొందేందుకు కటక్ నగర పాలక సంస్థ సీఎంసీ వివిధ పూజా కమిటీలు, వీధి కమిటీల ఆధ్వర్యంలో సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టింది. వచ్చే ఏడాది బాలి జాతర నాటికి జాతీయ హోదా సాధించేందుకు కృషి చేస్తున్నట్లు నగర మేయరు సుభాష్ సింగ్ తెలిపారు. ఈ జాతరకు జాతీయ నావికా వారసత్వ పండగ (నేషనల్ మారిటైమ్ హెరిటేజ్ ఫెస్టివల్) గుర్తింపు కోసం కేంద్ర సాంస్కృతిక శాఖ అసమర్థతపై సర్వత్రా అసంతృప్తి వ్యక్తం అవుతుంది.

**నగరాల్లో బాలి జాతర శకట ప్రచారం**

ఏటా కన్నుల పండువగా నిర్వహించే ఈ జాతరపై అవగాహన పెంచేందుకు బాలి జాతర శకటం పలు ప్రాంతాల్లో తిరుగుతోంది. కటక్ నగరం బాలి జాతర మైదాన ప్రాంగణం నుంచి ఈ శకటం బయల్దేరింది. డిసెంబర్ 4 వరకు వివిధ జిల్లాల్లో పర్యటిస్తుంది. కటక్ నగర పాలక సంస్థ (సీఎంసీ) మేయర్ సుభాష్ చంద్ర సింగ్ జెండా ఊపి ప్రారంభించారు. రాష్ట్రంలోనే అతిపెద్ద వాణిజ్య ఉత్సవం అయిన బాలి జాతర విస్తృత ప్రచారం లక్ష్యంగా భువనేశ్వర్, పూరీ, జగత్‌సింగ్‌పూర్, కేంద్రాపడా, జాజ్‌పూర్, పారాదీప్ ప్రాంతాల్లో ఈ శకటం పర్యటించి బాలి జాతర విశేషాల్ని ప్రచారం చేస్తుందన్నారు. ఏటా కార్తీక పూర్ణిమ సందర్భంగా మహానది ఒడ్డున బలి జాతర ప్రారంభం అవుతుంది. ఈ నేపథ్యంలో ఈ నెల 27వ తేదీ నుంచి ఆరంభమై డిసెంబర్ 4 వరకు కొనసాగుతుంది.



కటక్ బాలి జాతర ఆకర్షణీయమైన భారీ తోరణం

**అతిపెద్ద వేడుక..**

ప్రాచీన నావికా వర్తక వ్యాపార సంప్రదాయం, సంస్కృతికి ఏటా నిర్వహించే బాలి జాతర నిలువునా ప్రతిబింబింపజేస్తుంది. రాష్ట్రంలో అద్భుతమైన జలమార్గ వర్తక వ్యాపార చారిత్రాత్మక జ్ఞాపకార్థం నిర్వహించే అతి పెద్ద వేడుకగా ప్రసిద్ధి చెందింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసే ప్రదర్శనలు పలు ప్రాంతాల నుండి సందర్శించే లక్షలాది మంది సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంటాయి. ఈ ఏడాది హస్తకళల నుంచి గృహోపకరణాల వరకు వివిధ ఉత్పత్తుల ప్రదర్శనకు 1,900 స్టాల్స్‌ను ఏర్పాటు చేశారు. తమిళనాడుకు చెందిన ఓ ప్రైవేట్ సంస్థ మొబైల్ టన్నెల్ అక్వేరియం జాతరలో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుందని నిర్వాహకులు ఆశాభావం వ్యక్తం చేశారు. బాలి జాతర రాష్ట్రానికి గర్వ కారణమని, అద్భుతమైన నావికా వర్తక వ్యాపారం గత వైభవం, సంస్కృతి, భారత్, ఇండోనేషియా పురాతన వర్తక వాణిజ్య సంబంధాల్ని వర్ధమాన తరాలకు ప్రతిబింబిస్తుందని, ఈ నేపథ్యంలో భారత ప్రభుత్వం ఈ జాతరకు జాతీయ పండగ హోదా కల్పించాలని కటక్ నగర మేయరు పట్టుబడుతున్నారు. ఈ మేరకు భారత ప్రభుత్వం సానుకూలంగా స్పందించకుంటే పార్లమెంట్‌లో ఆందోళనకు దిగుతామని ఆయన హెచ్చరించారు.

**జీ20 సమావేశంలో ప్రస్తావన**

ఇటీవల ముగిసిన జీ20 సమ్మేళనం సందర్భంగా భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ బాలి జాతర గురించి ప్రస్తావించారు. ఈ జాతర ఇండోనేషియా బాలి ప్రాంతంలో నావికా వ్యాపార బంధానికి ప్రతీకగా ప్రధాని పేర్కొన్నారు. ఇది పురాతన కళింగ, ఆగ్నేయాసియా మధ్య 2,000 సంవత్సరాల జలమార్గ వర్తక వ్యాపార సాంస్కృతిక సంబంధాలను గుర్తు చేస్తుంది. 2019 సంవత్సరంలో రాష్ట్ర ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ బాలి జాతరకు జాతీయ నావికా వారసత్వ పండగ (నేషనల్ మారిటైమ్ హెరిటేజ్ ఫెస్టివల్) హోదాను కల్పించాలని అప్పటి కేంద్ర పర్యాటక శాఖ మంత్రి ప్రహ్లాద్ పటేల్‌కు లేఖ రాశారు. ఈ జాతర రాష్ట్ర సంస్కృతిలో భాగంగా ఇమిడిపోయింది. బాలి జాతర సామాజిక, సాంస్కృతిక ప్రాముఖ్యతను పరిగణనలోకి తీసుకుని జాతీయ నావికా వారసత్వ ఉత్సవం హోదాను కల్పించాలని ముఖ్యమంత్రి అభ్యర్థించారు.

### అట్టహాసంగా ఏర్పాట్లు

ఈ ఏడాది మహానది ఒడ్డున బాలి జాతరలో 360 డిగ్రీల టన్నెల్ అక్వేరియం ప్రత్యేక ఆకర్షణ. సువిశాల 20 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఎయిర్ కండిషన్డ్ హ్యాంగర్‌లో డిజిటల్ ఎగ్జిబిషన్ ఏర్పాటు చేస్తున్నారు. దీని కోసం కటక్ నగర పాలక సంస్థ రూ. 1.81 కోట్లు వెచ్చిస్తోంది. జాతరలో భాగంగా వారాంతాల్లో 2 సార్లు 20 నిమిషాల నిడివితో హరిత బాణాసంచా ప్రదర్శనకు మరో రూ. 27,73,000 సీఎంసీ వెచ్చిస్తోంది. 16వ నంబరు జాతీయ రహదారిపై రూ. 32 లక్షలు, నేతాజీ సుభాస్ బోస్ సేతు సమీపంలో రూ. 4 లక్షల వ్యయంతో 2 భారీ స్వాగత తోరణాలు, జాతర మార్గంలో ఇరు వైపుల సుందరీకరణ కోసం రూ. 4 లక్షలు వెచ్చిస్తున్నారు. జాతర మైదానంలో లేజర్ షో కూడా ఏర్పాటు చేస్తున్నారు.

# పీఎం మోదీ పాలనలోనే దేశం అభివృద్ధి



స్థానిక బీజేపీ నాయకులతో మాట్లాడుతున్న బైజయంత్ పండ



పండాకు స్వాగతం పలుకుతున్న మహిళా కార్యకర్తలు

- బీజేపీ జాతీయ ఉపాధ్యక్షుడు బైజయంత్ పండ
- రాయగడలో పర్యటన

రాయగడ: ప్రధానమంత్రి నరేంద్రమోదీ పాలనలోనే దేశం అభివృద్ధి చెందుతోందని భారతీయ జనతా పార్టీ జాతీయ ఉపాధ్యక్షుడు బైజయంత్ పండ అన్నారు. రాయగడలో ఆదివారం ఆయన పర్యటించారు. స్థానిక సిరికొనలోని పార్టీ కార్యాలయంలో కార్యకర్తలతో సమావేశమయ్యారు. ప్రధాని నరేంద్రమోదీ మన్ కీ బాత్ కార్యక్రమాన్ని కార్యకర్తలతో కలిసి వీక్షించారు. అనంతరం కార్యకర్తలతో మాట్లాడి.. జిల్లాలో పార్టీ పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. బీజేపీ పాలనలోనే దేశం అన్ని రంగాల్లో ముందుకు వెళ్తోందన్నారు. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న అగ్ర దేశాలతో సమానంగా భారతదేశం కూడా అన్ని రంగాల్లో పోటీ పడుతోందన్నారు. అభివృద్ధి విషయంలో కూడా దూసుకుపోతుందని వివరించారు. బీజేపీ ప్రవేశ పెట్టిన సంక్షేమ, ప్రజాహిత కార్యక్రమాలు మంచి ఫలితాలను ఇస్తున్నాయని చెప్పారు. రాష్ట్రంలో పార్టీకి అనుకూల పవనాలు వీస్తున్న నేపథ్యంలో అందుకు అనుగుణంగా కార్యకర్తలు పనిచేయాలని దిశానిర్దేశం చేశారు. తొలుత బైజయంత్ పండకు పార్టీ జిల్లా అధ్యక్షుడు శివకుమార్ పట్నాయక్, ఎస్సై, ఎస్టీ మోర్చ రాష్ట్ర శాఖ ఉపాధ్యక్షుడు కాశీరాం మాఝి, జిల్లా కార్యదర్శి కౌషార్ పండ, బసంత కుమార్ ఉలక తదితరులు స్వాగతం పలికారు. పార్టీ మహిళా మోర్చ కార్యకర్తలు ఆయన నుదుట తిలకాన్ని దిద్దారు.

# 'సమాజ శ్రేయస్సుకే రచన'



ప్రసంగిస్తున్న రఫీ, వేదికపై అప్పారావు, దాలినాయుడు తదితరులు

రాయగడ: సమాజ శ్రేయస్సుకు రచయితలు నిరంతరం కృషి చేయాలని శ్రీకాకుళానికి చెందిన ప్రముఖ రచయిత మహ్మద్ రఫీ అన్నారు. స్థానిక రాజ్ భవన్‌లో ఆదివారం జరిగిన రాయగడ రచయితల సంఘం (రారసం) పదో వార్షికోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. సమాజంలో చోటు చేసుకుంటున్న మూఢనమ్మకాలు, అన్యాయాలను రూపుమాపే విధంగా కవులు, రచయితలు కదం తొక్కాలని పిలుపునిచ్చారు. యువతకు సాహిత్యంపై అవగాహన కలిగేలా సంస్థలు, సంఘాలు ప్రోత్సహించాలని కోరారు. యువతకు కథలు, కథనాలపై శిక్షణ ఇవ్వాలన్నారు. ఇలాంటి కార్యక్రమాల్లో వారు పాల్గొనేలా చూడాలన్నారు. ఈ సందర్భంగా ముఖ్యవక్తగా సాలూరుకు చెందిన ప్రముఖ రచయిత కిలపర్తి దాలినాయుడు మాట్లాడుతూ నన్నయ్య నుంచి వేమన వరకు సాహిత్యంలో వచ్చిన మార్పులను వివరించారు. రారసం అధ్యక్షుడు టీవీఎస్ఆర్ అప్పారావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో గౌరవ అతిథిగా ప్రముఖ సాహితీ అభిమాని, పారిశ్రామిక వేత్త జీడీ చౌదరి పాల్గొని ప్రసంగించారు. కార్యదర్శి బాలకృష్ణ పట్నాయక్ వార్షిక నివేదికను చదివి వినిపించారు. స్థానికులు కవులు, రచయితలు ఈ సందర్భంగా కవితలు చదివి వినిపించారు.



కార్యక్రమంలో పాల్గొన్న అభిమానులు, రచయితలు

# ఓవర్ బ్రిడ్జి నిర్మించాలని వినతి



గంజాం జిల్లా వికాస్ మంచ్ ప్రతినిధులతో మాట్లాడుతున్న బరంపురం ఎస్పీ సార్వణ్ వివేక్



బజార్ రోడ్డులో ఓవర్ బ్రిడ్జి నిర్మించాలని కోరుతున్న గంజాం జిల్లా వికాస్ మంచ్ ప్రతినిధులు

బరంపురం: బరంపురం నగరంలో రోజురోజుకూ ట్రాఫిక్ సమస్య పెరుగుతోంది. దీంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఈ నేపథ్యంలో పోలీసులు దృష్టిసారించి సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాలని గంజాం వికాస్ పరిషత్ నాయకులు డిమాండ్ చేశారు. గేట్ బజార్ రోడ్డులో ఓవర్ బిడ్జి నిర్మించలని కోరుతూ బరంపురం పోలీసు జిల్లా కార్యాలయంలో ఎస్పీ సార్వణ్ వివేక్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. పరిషత్ అధ్యక్షుడు శివప్రసాద్ పాత్రో ఎస్తతో సార్వణ్ వివేక్‌తో మాట్లాడుతూ గేట్ బజార్ రోడ్డులో నిత్యం తలెత్తుతున్న ట్రాఫిక్ సమస్యతో నగర ప్రజలు అనేక విధాలుగా ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ఈ నేపథ్యంలో గేట్ బజార్ రోడ్‌లో ఓవర్ బిడ్జి నిర్మించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. బరంపురం నగరంలో ట్రాఫిక్ సమస్య దూరం చేసేందుకు కొన్నేళ్ల క్రితం కోమ్మపల్లి ఫ్లైఓవర్ బ్రిడ్జి, అలాగే హల్దియా పడ్ ఫ్లైఓవర్ బ్రిడ్జిలను వినియోగంలోకి తీసుకొచ్చారు. అలాగే కొద్ది రోజుల క్రితం రాష్ట్ర ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ మూడో గూడ్స్ వద్ద ఫ్లైఓవర్ బ్రిడ్జిని ప్రారంభించి ప్రజలకు అంకితం చేశారు. అయితే ప్రారంభించి బ్రిడ్జి ప్రారంభించి సుమారు నాలుగు నెలలైనా సౌత్–కో విభాగం అధికారులు విద్యుత్ లైట్లు అమర్చక పోవటంతో రాత్రి వేళలో ఈ ప్రాంతమంతా అంధకారంగా ఉంటుంది. అధికారులు స్పందించి లైట్లను ఏర్పాటు చేయాలని గంజాం జిల్లా వికాస్ మంచ్, బహుముఖి సమాజ్ వాది సంస్థ ప్రతినిధులు, స్థానిక ప్రజలు కోరుతున్నారు.

# పాడిపరిశ్రమతో అధిక ఆదాయం

- సీడీవీఓ ధర్మేంద్ర మహంతి



మాట్లాడుతున్న అసిస్టెంట్ వెటర్నరీ అధికారి రమాకాంత రోణా

పర్లాకిమిడి: పాడిపరిశ్రమ ద్వారా రైతులకు ఏడాదికి రూ.2 నుంచి రూ.3 లక్షల వరకు ఆదాయం లభిస్తుందని జిల్లా ముఖ్య వెటర్నరీ అధికారి ధర్మేంద్ర మహంతి అన్నారు. స్థానిక మట్టి సంరక్షణ కార్యాలయం వద్ద వాటర్ షెడ్ కాన్ఫరెన్స్ హాల్‌లో జాతీయ పాల దినోత్సవాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సెంచూరియన్ వర్సిటీ ఫిషరీస్ డిపార్ట్‌మెంట్ డీన్ గిరిష్ మహంతి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జిల్లా ఉద్యానవనాల డిప్యూటీ డైరెక్టర్ సుశాంత రంజన్ దాస్, అసిస్టెంట్ వెటర్నరీ అధికారి రమాకాంత రోణా, జిల్లా పరిశ్రమల అధికారి సునారాం సింగ్ తదితరులు పాల్గొన్నారు. జిల్లాలో ఏడు సమితి కేంద్రాల్లో అనేక పంచాయతీల్లో ఆవులు, గేదెల పెంపకం వల్ల పాల ఉత్పాదన బాగుందని ఆదనపు వెటర్నరీ అధికారి రమాకాంత రోణా అన్నారు. ఆవులు పెంపకం ద్వారా పాల ఉత్పాదన పెంపొంది, ఓంఫెడ్‌కు పాలను అందజేసి నెలకు కొంత ఆదాయం పాడి రైతులు పొందగలుగుతున్నారన్నారు. పాల ద్వారా వెన్న, పన్నీరు, నెయ్యిని తీసి మార్కెట్‌లో పాలను సరఫరా చేసుకోవచ్చన్నారు. పాడి రైతులకు రాష్ట్ర ప్రభుత్వం సబ్సిడీ అందజేస్తుందన్నారు. జిల్లాలో పాల పరిశ్రమ ద్వారా ఆర్థికంగా బలపడిన పాడి రైతులకు జిల్లా పశుసంపద శాఖ అధికారులు మెమొంటోలు, ప్రోత్సాహకాలు సెంచూరియన్ వర్సిటీ డీన్ గిరిష్ మహంతి చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమానికి జిల్లాలో పాడి రైతులు, ఇతర వెటర్నరీ అధికారులు, వీఎల్‌డీఐలు హాజరయ్యారు.

# అయ్యో అకాల వర్షం



ధాన్యం కోతలు కోస్తూ పొలాల్లో ఎండబెడుతున్న రైతులు



వర్షాలకు తడిచిన ధాన్యం చేను

జయపురం: అల్పపీడనం కారణంగా గత రెండు రోజులుగా కొరాపుట్ జిల్లాలో పడుతున్న అకాల వర్షాలు రైతులకు కన్నీళ్లు తెప్పిస్తున్నాయి. పంటలు బాగా పండడంతో ఇప్పుడిప్పుడే కోతలు మొదలు పెట్టారు. కొన్ని చోట్ల వన్నలను పొలాల్లో ఆరబెట్టారు. ఇప్పటికే పొగ మంచు వల్ల రైతులు ఇబ్బందులు పడుతుండగా ఇప్పుడు వానలు ఇంకా భయపెడుతున్నాయి. రెండు రోజుల్లో దాదాపు 15 మిల్లీ మీటర్ల వర్షం పడినట్లు తెలుస్తోంది. ఆదివారం కాస్త ఎండ కాసినా తడిచిన ధాన్యం మొలకలెత్తితే కొనుగోలు చేయరని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం స్పందించి ఆదుకోవాలని కోరుతున్నారు.

# విద్యతోనే వికాసం

- మంత్రి జగన్నాథ సరక
- ఏకలవ్య పాఠశాలలో వార్షికోత్సవాలు ప్రారంభం



వాలీబాల్ పోటీలో పాల్గొన్న విద్యార్థినులు



కార్యక్రమంలో ప్రసంగిస్తున్న మంత్రి సరక, వేదికపై ముదులి, మాఝి తదితరులు

రాయగడ: విద్యతోనే వికాసం సాధ్యమవుతుందని రాష్ట్ర ఆదివాసీ, హరిజన సంక్షేమ శాఖ మంత్రి జగన్నాథ సరక అన్నారు. స్థానిక సిరకొనలో గల ఏకలవ్య ఆదర్శ పాఠశాలలో ఆదివారం వార్షికోత్సవాలు ప్రారంభమయ్యాయి. కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. నేటి ప్రభుత్వం పాఠశాలలను ఆధునీకీకరించిందని, ఆధునిక, సాంకేతిక విద్యను అభ్యసించే విధంగా ప్రోత్సహిస్తోందని తెలిపారు. సంక్షేమ శాఖ పరిధిలో గల పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ప్రభుత్వం మరిన్ని సౌకర్యాలు కల్పిస్తుందని అన్నారు. సర్గీఫూల్ పేరిట నిర్వహిస్తున్న ఈ వార్షికోత్సవాలు విద్యార్థుల మానసిక వికాసానికి తోడ్పడతాయన్నారు. రాయగడ ఎమ్మెల్యే మకరంద ముదులి మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనను వెలికి తీస్తాయని అన్నారు. ఎంతో దూరం నుంచి చదువుకునేందుకు ఆశ్రమ పాఠశాలలకు వచ్చే విద్యార్థులు ఉపాధ్యాయులు చెప్పిన పాఠాలు శ్రద్ధతో వినాలని సూచించారు. ఒకప్పుడు తాను కూడా ఆశ్రమ పాఠశాలలోనే చదివానని గుర్తు చేసుకున్నారు. అలాగే జిల్లా పరిషత్ అధ్యక్షురాలు సరస్వతి మాఝి, ఎస్‌డీసీ చైర్మన్ అనసూయా మాఝి, సీఐ ఆఫ్ స్కూల్స్ శ్యామఘన్ భయ్య తదితరులు పాల్గొని ప్రసంగించారు.



సర్గీఫూల్ ఉత్సవాల్లో విద్యార్థుల నృత్య సందడి



సైన్స్ ప్రదర్శనలు

**ఆకట్టుకున్న విజ్ఞాన ప్రదర్శన**

వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఏకలవ్య పాఠశాల ఆధ్వర్యంలో నిర్వహించిన సైన్స్ ప్రదర్శన ఆకట్టుకుంది. పర్యావరణం కాలుష్యమవుతున్న ఈ రోజుల్లో దాన్ని ఎలా కాపాడుకోవాలి, పర్యావరణ హిత కార్యక్రమాలు ఎలా చేపట్టాలి అందుకు ఎలా చైతన్యవంతులు కావాలని అనే కోణంలో విద్యార్థులు ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. మంత్రి సరక సైన్స్ ప్రదర్శనను ప్రారంభించారు. అనంతరం విద్యార్థులకు వాలీబాల్ పోటీలు నిర్వహించారు. సోమవారంతో ఉత్సవాలు ముగుస్తాయి.



ఉత్సవాల్లో పాల్గొన్న విద్యార్థులు

## క్లుప్తంగా

### ఉత్తమ సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడిగా కేశవరావు



కేశవరావును అభినందిస్తున్న సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుల ఫోరం సభ్యులు

హిరమండలం: రాష్ట్ర ఉత్తమ సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడిగా స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు టి.కేశవరావు అవార్డు అందుకున్నారు. భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా సాంఘిక శాఖ ఉపాధ్యాయుల ఫోరం అవార్డులను ప్రకటించింది. శ్రీకాకుళం జిల్లా నుంచి కేశవరావును ఎంపిక చేసింది. శనివారం విజయవాడలో రాష్ట్ర విద్యా పరిశోధన శిక్షణ సంస్థ డైరెక్టర్ ప్రతాపరెడ్డి చేతులమీదుగా కేశవరావు పురస్కారంతో పాటు ప్రశంసాపత్రం అందుకున్నారు. హెచ్‌ఎం కేశవరావుకు పురస్కారం లభించడంపై ఎంఈవోలు కె.రాంబాబు,షన్ముఖరావులు, ఉపాధ్యాయులు, అటు ఆంధ్రా యూనివర్సిటీ ప్రొఫెసర్లు సైతం అభినందనలు తెలిపారు.

### రోడ్డు ప్రమాదంలో గిరిజన రైతు మృతి



మాళువ రవి (ఫైల్)

సారవకోట: మండలంలోని చిన్నకిట్టాలపాడు పంచాయతీ సవరబొంతు గ్రామానికి చెందిన మాళువ రవి(40) శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలపాలై ఆదివారం విశాఖపట్నం కేజీహెచ్‌కి తరలిస్తుండగా మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. రవి గ్రామం నుంచి లంబ నరేంద్రతో కలసి ద్విచక్ర వాహనం మీద బొంతు జంక్షన్‌కు శనివారం రాత్రి 10.30 సమయంలో వెళ్తుండగా రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలపాలైన రవిని తొలుత ఐటీడీఏ అంబులెన్స్‌లో నరసన్నపేట ఆస్పత్రికి అక్కడి నుంచి శ్రీకాకుళం సర్వజన ఆస్పత్రికి తీసుకెళ్లారు. అయితే అక్కడ పరిస్థితి విషమించడంతో విశాఖపట్నం కేజీహెచ్‌కు తరలిస్తుండగా కేజీహెచ్‌కు సమీపంకు వెళ్లే సమయానికి మృతి చెందాడు.

### లాసెట్ కౌన్సెలింగ్ జాబితాలో బీఆర్‌ఏయూ న్యాయ కళాశాల

ఎచ్చెర్ల క్యాంపస్: లాసెట్–2023 ఆన్‌లైన్ కౌన్సెలింగ్ కొనసాగుతోంది. ఈ జాబితాలో ప్రారంభంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో మహాత్మా జ్యోతీరావు పూలే న్యాయ కళాశాల లేకపోవటంతో విద్యార్థులు ఆందోళన చెందారు. ఉన్నత విద్యా మండలి, బార్ కౌన్సెల్ ఆఫ్ ఇండియా దృష్టికి సమస్యను రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సీహెచ్‌ఏ రాజేంద్ర ప్రసాద్ తీసుకువెళ్లారు. స్పందించిన అధికారులు జాబితాలో వర్సిటీ న్యాయ కళాశాలను చేర్చారు. ప్రస్తుతం ఆన్‌లైన్‌లో కళాశాల ఎంపిక జాబితాలో వర్సిటీ కళాశాల ఉంది. గతంలో ప్రైవేట్ కళాశాల ఎంపిక చేసుకున్న విద్యార్థులు మళ్లీ ఆప్షన్ల మార్పులో వర్సిటీ కళాశాల ఆప్షన్ ఇచ్చుకోవచ్చు. ఆప్షన్ల ఎంపిక నోటిఫికేషన్ మేరకు ఈ నెల 25న ప్రారంభం కాగా, 27వ తేదీ వరకు కొనసాగనుంది. 28న కళాశాలల ఆప్షన్ మార్పునకు అవకాశం కల్పించారు. వర్సిటీలో ఈడబ్ల్యూఎస్ కోటాతో కలిపి 66 సీట్లు ఉన్నాయి. అర్హులైన విద్యార్థులకు జగనన్న విద్యా దీవెన, వసతి దీవెనలు వర్తిస్తాయి. ఈ నెల 30వ తేదీన సీట్లు ప్రకటిస్తారు. డిసెంబర్ 1, 2 తేదీల్లో సీటు లభించిన కళాశాలలో విద్యార్థులు చేరాల్సి ఉంటుంది. వర్సిటీలో న్యాయ విద్యను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని రిజిస్ట్రార్ కోరారు.

### గుర్తు తెలియని రైలు ఢీ కొని మహిళ మృతి

ఆమదాలవలస: స్థానిక రైల్వేస్టేషన్ పరిధి వెంగళరావు కాలనీ సమీపంలో అప్‌లైన్ ట్రాకుపై ఆదివారం గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యమైనట్లు జీఆర్‌పీ హెచ్‌సీ సీహెచ్ చక్రధరరావు తెలిపారు. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు మృతదేహం వద్దకు చేరుకున్నామని తెలిపారు. రైలు ఢీకొని మృతి చెంది ఉంటుందని తెలిపారు. మృతురాలు సుమారు 45 వయస్సు కలిగి ఉంటుందని, లేత గులాబీ రంగు టాపు, నాచుకలర్ చలికోటు ధరించి ఉన్నారన్నారు. మృతురాలి వివరాలు తెలిసిన వారు ఆమదాలవలస జీఆర్‌పీ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు. మృతదేహాన్ని శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించామన్నారు. దీనిపై జీఆర్‌పీ ఎస్‌ఐ శ్రీనివాసరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

### వరికుప్ప దగ్ధం



వరికుప్ప మంటలను ఆర్పుతున్న స్థానికులు

హిరమండలం: హిరమండలం నౌగూడ గ్రామ సమీపంలో ఎస్.శిమ్మయ్య అనే రైతుకు చెందిన వరి కుప్ప ఆదివారం ఉదయం అగ్నికి ఆహుతైపోయింది. దాదాపు ఎనభై సెంట్ల ఫలసాయం కాలిపోవడంతో రైతు గుండెలవిసేలా రోదించారు. స్థానికులు మంటలను చూసి ఆర్పే ప్రయత్నం చేసినా ఫలితం లేకపోయింది. కొత్తూరు అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలు అదుపులోకి తెచ్చారు.

# కార్తీక శోభ

జయపురం: కార్తీక పూర్ణిమ సందర్భంగా ఆదివారం జయపురంలో అనేక దేవాలయాలు భక్తజనంతో కిటకిటలాడాయి. సోమవారం వరకు పౌర్ణమి ఘడియలు ఉంటాయని పూజారులు తెలిపారు. జయపురం శ్రీజగన్నాథ ఆలయం భక్తులతో కిక్కిరిసింది. భజన సంకీర్తనలతో హోరెత్తింది. ఈ సందర్భంగా జయపురంలో జగన్నాథ, బలభద్ర, సుభద్రలను, గీతామందిరంలో శ్రీకృష్ణుని, జగన్నాథ మదిర ప్రాంగణంలో గల వల్లభ నారాయణ మందిరంలో వల్లభ నారాయుడిని భగవతీ మందిరంలో మా భగవతీ దేవిని, రఘునాథ మందిరంలో సీతారామలక్ష్మణులను ప్రత్యేకంగా అలంకరించారు.




కార్తీక పౌర్ణమి సందర్భంగా భక్తులకు దర్శనమిచ్చిన జగన్నాథ, బలభద్ర, సుభద్రలు



జయపురం గీతా భవనంలో భక్తులకు దర్శనమిస్తున్న శ్రీకృష్ణ భగవానులు



భక్తులకు దర్శనమిస్తున్న వల్లభ నారాయణుడు



రఘునాథ్ మందిరంలో భక్తులకు దర్శనమిస్తున్న సీతారామ లక్ష్మణులు



జయపురంలో సంకీర్తనలు జరుపుతున్న భక్తులు



వల్లభ నారాయణ మందిరం వద్ద భక్త జనం



పూజ సామగ్రి, పండ్లు అమ్ముతున్న గ్రామీణ మహిళలు



జగన్నాథ మందిరం వద్ద భక్త జనం



మా భగవతి మందిరం చుట్టూ భజనలు చేస్తూ ప్రదర్శనలు చేస్తున్న యువ భక్తులు



మందిరం వద్ద పూలు అమ్ముతున్న మహిళలు



కార్తీక పౌర్ణమి సందర్భంగా కొనుగోలు దారులతో కిటకిట లాడుతున్న దైనిక బజారు

# మార్కెట్‌కు పౌర్ణమి శోభ



జనంతో రద్దీగా ఉన్న బరంపురంలోని గిరి మార్కెట్

బరంపురం: హిందువుల అతి ముఖ్యమైన పండుగ కార్తీక పౌర్ణమి. ఆది, సోమవారాల్లో కార్తీక పౌర్ణమిని ప్రజలు జరుపుకుంటున్నారు. దీంతో బరంపురం నగరంలోని వివిధ మార్కెట్లో పూజా సామగ్రి అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. కొనుగోలుకు వచ్చే వారితో మార్కెట్ కొత్త శోభను సంతరించుకుంది. జనంతో వీధులన్నీ రద్దీగా మారాయి. అయితే పూజా సామగ్రి ధరలు పెరగడంతో కొనుగోలుదారులు ఇబ్బంది పడ్డారు. డజన్ అరటి పళ్ల రూ.60, యాపిల్స్ కిలో రూ. 200, దానిమ్మ రూ. 200 పలికింది. పక్క రాష్ట్రం ఆంధ్రాలోని కవిటి, ఉద్దానం, ఇచ్ఛాపురం, కంచిలి, పలాస నుంచి వ్యాపారులు వివిధ సామగ్రిని బరంపురం నగరానికి తీసుకొని వచ్చి విక్రయించారు. వివిధరకాల పువ్వులకు గిరాకీ ఏర్పడింది.



కొమ్మపల్లి మార్కెట్‌లో పూజా సామగ్రి విక్రయం



గిరి మార్కెట్‌లో సిద్ధంగా ఉన్న పూజా సామగ్రి



గిరి మార్కెట్‌లో సిద్ధంగా ఉన్న పండ్లు

# ఘనంగా మేరీమాత ఉత్సవాలు

- ఆకట్టుకున్న కొవ్వొత్తుల ర్యాలీ

బరంపురం: స్థానిక పాత బస్టాండ్, చర్చి రోడ్డులో వారం రోజులుగా మిషన్ రాణి ఆధ్వర్యంలో జరుగుతున్న మేరీమాత ఉత్సవాలు అదివారంతో ఘనంగా ముగిశాయి. సాయంత్రం చర్చి రోడ్డు నుంచి భారీ కొవ్వొత్తుల ర్యాలీ జరిగింది. పాత బస్‌స్టాండ్, ఫైర్‌స్టేషన్ రోడ్డు, అర్బన్ బ్యాంక్ రోడ్డు, ఎస్ఎన్‌టీ రోడ్డు, వన్‌వై ట్రాఫిక్ రోడ్డు, దోళువా వీధి గుండా మేరీమాతను ఊరేగిస్తూ ర్యాలీ సాగింది. ర్యాలీలో గంజాం, గజపతి, రాయగగ, కొంధమాల్, నయాగడా జిల్లాల నుంచి వేలాది మంది క్రిస్టియన్లు పాల్గొన్నారు.



చర్చి రోడ్డులో మేరీమాత ఉత్సవాల్లో క్రైస్తవులు



క్యాండిల్ ర్యాలీలో భక్తులు



కొవ్వొత్తుల ర్యాలీ చర్చి ఫాదర్లు

## వీధుల్లో కార్డన్ సెర్చ్



వీధుల్లో తనిఖీలు చేస్తున్న పోలీసులు

టెక్కలి రూరల్: గోపీనాథపురంలో ఆదివారం ఉదయం టెక్కలి పోలీసులు కార్డర్ సెర్చ్ నిర్వహించారు. టెక్కలి సీఐ సూర్యచంద్ర మౌళి ఆధ్వర్యంలో ముగ్గురు ఎస్ఐలతో పాటు 45మంది సిబ్బంది ఉదయం సుమారు 6 గంటల సమయంలో కార్యక్రమం నిర్వహించి ప్రతి ఇంటినీ తనిఖీ చేశారు. వీధుల్లో ఉన్న ద్విచక్రవాహనాలు, కార్లు, ఆటోల రికార్డులను పరిశీలించారు. అనంతరం రికార్డు లేని వాహనాలను పోలీసులు అదుపులో తీసుకున్నారు. అనంతరం అక్కడ ప్రజలతో మాట్లాడుతూ వీధుల్లో అపరిచిత వ్యక్తులు తిరిగినా అనుమానాస్పద స్థితిలో ఎవరైనా కనిపించినా సమాచారం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో టెక్కలి ఎస్ఐ రామకృష్ణతో పాటు నందిగాం, కోటబొమ్మాళి ఎస్ఐలు, ఎస్ఐ–2, ఏఎస్ఐల తోపాటు సిబ్బంది పాల్గొన్నారు.

# ఘనంగా రాజ్యాంగ దినోత్సవం



పర్లాకిమిడి: అంబేడ్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

పర్లాకిమిడి: స్థానిక కాంగ్రెస్ భవన్‌లో భారత రాజ్యాంగ దినోత్సవాన్ని ఆ పార్టీ నాయకులు ఆదివారం నిర్వహించారు. డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ చిత్రపటానికి ఒడిశా ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు శరత్ పట్నాయక్ పూలమాలలు వేశారు. కాంగ్రెస్ యువజన అధ్యక్షుడు సూర్య నారాయణ పాత్రో, పురపాలక సంఘం మాజీ అధ్యక్షుడు అభిమన్యుపండా, ఉపాధ్యక్షురాలు జస్మిన సాహిక్ రఫీ, రాజపాత్రో, మాజీ కౌన్సిలర్ బిష్ణుపాడి తదితరులు పాల్గొన్నారు.

**జయపురం జిల్లా కోర్టులో..**

జయపురం: కొరాపుట్ జిల్లా న్యాయ సేవా ప్రదీకరణ ఆధ్వర్యంలో జిల్లా జడ్జి కోర్టు, జయపురంలో రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించారు. జిల్లా జడ్జి, జిల్లా న్యాయసేవా ప్రాధికరణ అధ్యక్షుడు సత్యనారాయణ మిశ్ర పాల్గొన్నారు. జిల్లా జడ్జి మాట్లాడుతూ మన దేశ రాజ్యాంగం 1949 నవంబర్ 26న ఆమోదించారని, అప్పటి నుంచి రాజ్యాంగ దినోత్సవం పాటిస్తున్నామని వివరించారు. అంబేడ్కర్ రచించిన రాజ్యాంగం భావి తరాల వారికి స్ఫూర్తిగా నిలుస్తుందన్నారు. విజిలెన్స్ కోర్టు జడ్జి రాజేష్ ఎక్కా, ఫామిలీ కోర్టు జడ్జి పవిత్ర మోహన సామల్, సీనియర్ సివిల్ జడ్జి రేఖారాణి పండా తదితరులు పాల్గొన్నారు.

# భక్తిశ్రద్ధలతో ధర్మ దియాలీ పర్వ్



కలశ యాత్రలో పాల్గొన్న మహిళలు

జయపురం: డొంబు సంఘటనలో ధర్మ దియాలీ పర్వ్ శుక్రవారం భక్తిశ్రద్ధలో నిర్వహించారు. మహిళలు లోవర్ కొలాబ్ కూడలి వద్ద గల ధర్మ దియాలీ మండపానికి కలసాలతో వెళ్లి పూజలు నిర్వహించారు. ప్రతి ఏడాది డొంబు సంప్రదాయ ప్రజలు ప్రత్యేక పూజలు, పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడం అనవాయితీ వస్తుంది. మధ్యాహ్నం బరిణిపుట్‌లోని జగన్నాథ్ మందిరానికి వెళ్లి పూజలు చేశారు.

## క్లుప్తంగా

### ముగ్గురికి మలేరియా

- ఒకరి పరిస్థితి విషమం
- కేజీహెచ్‌కు తరలింపు



సర్వజన ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మలేరియా బాధితుడు విష్ణువర్ధన్

**బొండపల్లి:** మండలంలోని దేవుపల్లి గ్రామ పంచాయతీ గిరిజన గ్రామమైన కొండవానిపాలెం పరిధిలో గ్రీన్‌ఫీల్డ్ జాతీయ రహదారి పనులు చేసేందుకు గాను ఇతర ప్రాంతాల వచ్చిన ఇద్దరు వ్యక్తులతో పాటు అదే పనిలో ఉన్న గ్రామస్తుడు ఒకరు మలేరియా బారిన పడి చికిత్స పొందుతున్నారు. వివరాలిలా ఉన్నాయి. బాడంగి మండలంలోని వీరసాగరం గ్రామానికి చెందిన దుమ్మెర విష్ణువర్ధన్‌తో పాటు అతని తమ్ముడు అభికి మలేరియా రావడంతో చికిత్స చేయించుకోగా అభికి పూర్తిగా నయమై ప్రస్తుతం బాగానే ఉన్నాడు. విష్ణువర్ధన్‌కు మలేరియా పాజిటివ్ రావడంతో పాటు రక్తహీనత సమస్య ఉండడంతో పరిస్థితి విషమించింది. దీంతో జిల్లా కేంద్రంలోని సర్వజన కేంద్రాస్పత్రిలో ప్రథమ చికిత్స తరువాత విశాఖ పట్టణంలోని కేజీహెచ్‌కు తరలించారు. ఈ విషయం గురించి దేవుపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి బి.సత్యవతిని వివరణ కోరగా గ్రామంలో ముగ్గురికి మలేరియా పాజిటివ్ వచ్చిందని, అందులో ఇద్దరు పూర్తిగా రికవరీ అయ్యారని, ఒకరి పరిస్థితి బాగోలేకపోవడంతో విశాఖ తరలించరని, పీహెచ్‌సీ సూపర్‌వైజర్ నారాయణప్పల నాయుడుతో పాటు, ఏఎన్‌ఎంల ద్వారా రోగి ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు తెలుసుకుంటున్నామన్నారు. అలాగే గ్రామంలో కూడా ప్రతి ఇంటికి వెళ్లి రక్త నమునాలు సేకరించడంతో పాటు, ప్రత్యేకంగా వైద్యశిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు

### యువకుల ఆందోళన

- భారీ లారీల అడ్డగింత

**లక్కవరపుకోట:** మండలంలోని శ్రీరాంపురం గ్రామ సమీపంలో గల స్టీల్ ఎక్స్చేంజ్ ఇండియా లిమిటెడ్ కర్మాగారం నుంచి వెళ్తున్న భారీ లారీలు వెదజల్లుతున్న కాలుష్యం నుంచి కాపాడాలి అంటూ గ్రామ యువకులు ఆదివారం ఆందోళనకు దిగారు. గ్రామాన్ని ఆనుకుని ఉన్న పంచాయతీ రాజ్ రోడ్డు మీదుగా కర్మాగారానికి చెందిన భారీ లారీలు నిత్యం రాకపోకలు సాగిస్తున్నాయి. రోడ్డుపై పరిమితి మించిన బరువులతో లారీలు ప్రయాణిస్తున్నాయని గ్రామస్తులు ఈ సందర్భంగా ఆందోళన వెలిబుచ్చారు. దీంతో విపరీతమైన కాలుష్యం రేగుతోందని ఇళ్లల్లో ఉండలేకపోతున్నామని వాపోయారు. అంతేకాకుండా రోడ్డుకు అడ్డంగా లారీలను నిలిపేయడంతో ట్రాఫిక్ జామ్ అవడంతో అత్యవసర సమయాల్లో రాకపోయలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. కాలుష్యంతో రోగాల బారిన పడుతున్నామని తక్షణమే గ్రామాన్ని ఆనుకుని ఉన్న కర్మాగారం గేటును మూసివేసి ఈ రోడ్డుపై భారీ లారీల రాకపోకలను అరికట్టాలని డిమాండ్ చేస్తూ లారీలను నిలిపేశారు. దీంతో సమాచారం మేరకు ఎల్.కోట ఏఎస్సై గోవిందరావు, సత్యంలు ఘటనా స్థలానికి చేరుకుని ప్రస్తుతం లారీలు రాకపోకలు సాగించేందుకు సహకరించాలని, సోమవారం కర్మాగార యజమాన్యం, అధికారులతో చర్చలు జరిపి న్యాయం జరిగే విధంగా చూస్తామని హామీ ఇవ్వడంతో యువకులు శాంతించి ఆందోళన విరమించారు.

### 28, 29 తేదీలలో రోల్ అబ్జర్వర్ రాక

**పార్వతీపురం:** ఎన్నికల రోల్ అబ్జర్వర్, సీనియర్ ఐఏఎస్ అధికారి జె.శ్యామలరావు ఈ నెల 28, 29 తేదీలలో జిల్లా పర్యటనకు రానున్నారని జిల్లా రెవెన్యూ అధికారి జె.వెంకటరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో వివిధ ప్రాంతాలలో ఓటరు జాబితా సవరణ వివరాలు తనిఖీ చేస్తారని, ప్రజాప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఓటరు నమోదు అధికారులతో జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సమావేశాలను నిర్వహిస్తారని ఆయన తెలిపారు.

### ఆకట్టుకున్న రాయలవారి కవితా సౌరభం



గార రంగనాథాన్ని సత్కరిస్తున్న విజయభావన సమాఖ్య ప్రతినిధులు

**విజయనగరం టౌన్:** విజయభావన సాహితీ మిత్ర సమాఖ్య ఆధ్వర్యంలో స్థానిక గురజాడ గ్రంథాలయంలో ఆదివారం నిర్వహించిన రాయలవారి కవితా సౌరభం ఆద్యంతం ఆకట్టుకుంది. ప్రధానవక్తగా హాజరైన రాజాం రచయితల వేదిక వ్యవస్థాపకుడు గార రంగనాథం ఆముక్త మాల్యదా పద్యాలోకనం అంశంపై ప్రసంగించారు. ప్రబంధాలకు మకుటాయమానం కృష్ణరాయలు రచించిన ఆముక్త మాల్యద అని తెలిపారు. మూలకథలో కానీ ప్రకృతి వర్ణనలో కానీ, పటిష్టమైన పద్యరచనా శైలిలో గానీ ఇతర కవుల కంటే భిన్నమైన మార్గంలో ఈ రచన ఉంటుందని సోదాహరణంగా వివరించారు. అనంతరం రంగనాథాన్ని సమాఖ్య ప్రతినిధులు దుశ్శాలువతో ఘనంగా సత్కరించారు. డాక్టర్ వై.బాబూరావు, డాక్టర్ ఎ.గోపాలరావు, దశగ్రంథాల సుబ్రహ్మణ్యం, డాక్టర్ విజయాదిత్య, అన్నపూర్ణాదేవి, శంకరం, డాక్టర్ హరిచందన్, సోమేశ్వరరావు, భాస్కరరావు, సాహితీవేత్తలు పాల్గొన్నారు.

# స్వేచ్ఛా జీవనానికి రాజ్యాంగమే మూలం

- జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు



భారత రాజ్యాంగ ప్రతులను చదువుతూ ప్రతిజ్ఞ చేస్తున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, తదితరులు

**విజయనగరం రూరల్:** కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు భారతీయ పౌరులు స్వేచ్ఛగా జీవనం సాగిస్తున్నారంటే అందుకు భారత రాజ్యాంగమే మూలమని జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు పేర్కొన్నారు. భారత రాజ్యాంగ ఆమోద దినోత్సవం సందర్భంగా జిల్లా పరిషత్ కార్యాలయం ఆవరణలో ఉన్న రాజ్యాంగ రూపకర్త బాబాసాహెబ్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి జెడ్పీ చైర్మన్ శ్రీనివాసరావు, జెడ్పీ సీఈవో కె.రాజ్ కుమార్ తదితరులు ఆదివారం పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం జెడ్పీ చైర్మన్ మాట్లాడుతూ ప్రపంచంలో అతిపెద్ద ప్రజాస్వామ్య దేశం భారతదేశమని, భారత రాజ్యాంగం అతి పెద్దదని పేర్కొన్నారు. దేశంలోని అన్ని కుల, మతాలు, అన్ని వర్గాల ప్రజలను గౌరవిస్తూ భారత రాజ్యాంగాన్ని రూపొందించినందుకు భారతీయ పౌరులుగా మనం గర్వించాలని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ కార్యాలయం సిబ్బంది, వైఎస్సార్‌సీపీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# రాజ్యాంగం మహోన్నతం

- ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర



గాంధీజీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర

**సాలూరు:** భారత రాజ్యాంగం మహోన్నతమైనదని ఉపముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమశాఖామంత్రి పీడిక రాజన్నదొర అన్నారు. భారత రాజ్యాంగ ఆమోద దినోత్సవం సందర్భంగా ఆదివారం ఆయన సాలూరు పట్టణంలోని తన గృహం వద్ద బీఆర్‌అంబేడ్కర్ చిత్రపటానికి, తహసీల్దార్ కార్యాలయం వద్ద గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, లిఖిత పూర్వకమైన గొప్ప రాజ్యాంగాన్ని రూపొందించిన డా.బీఆర్ అంబేడ్కర్ మహనీయుడని కొనియాడారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు వంగపండు అప్పలనాయుడు, జర్జాపు సూరిబాబు, రెడ్డి సురేష్, గిరిరఘు, గొర్లె జగన్, పిరిడి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# క్రెడయ్ ప్రోపర్టీ టెక్ ఎక్స్‌పో ప్రారంభం



క్రెడయ్ ప్రాపర్టీ టెక్ ఎక్స్‌పోను ప్రారంభిస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

- పాల్గొన్న డిప్యూటీ స్పీకర్, జెడ్పీ చైర్మన్

**విజయనగరం:** స్థిరాస్తులు కొనుగోలు చేసేందుకు ఆసక్తి కనబరిచే వారికి క్రెడయ్ ప్రోపర్టీ టెక్ ఎక్స్‌పో ఉపయుక్తంగా ఉంటుందని ఏపీ శాసనసభ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, విజయనగరం జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావులు పేర్కొన్నారు. క్రెడయ్ ఆధ్వర్యంలో నగరంలోని రింగ్‌రోడ్డులో గల లీ ప్యారడైజ్ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన ఎక్స్‌పోను ఆదివారం వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎక్స్‌పో ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను సందర్శించారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో నివసిస్తున్న వారు ఇళ్లస్థలాలు, అపార్ట్‌మెంట్‌లు కొనుగోలు చేయడానికి అన్ని నిర్మాణ సంస్థలను ఒకే వేదికపైకి తీసుకువచ్చి ఎక్స్‌పో ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. దీని ద్వారా కొనుగోలుదారు తనకు నచ్చిన ప్రదేశంలో, తనకు అవకాశం ఉన్న ధరలో కొనుగోలు చేయవచ్చన్నారు. ఇళ్లు, స్థలాలతో పాటు ఇళ్ల నిర్మాణానికి ఉపయోగించే సిమెంట్, ఐరన్, హార్డ్‌వేర్, ఇంటీరియర్ తదితర సామగ్రిని కూడా గుర్తింపు పొందిన కంపెనీల నుంచి కొనుగోలు చేసుకోవచ్చని చెప్పారు. ఇటువంటి ఎక్స్‌పోలను ఏడాదికి రెండుసార్లు నిర్వహించేలా క్రెడయ్ సంస్థ ముందుకు రావాలని ఆకాంక్షించారు. క్రెడయ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.సుభాష్ చంద్రబోస్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో విజయనగరం మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, పలాస నియోజకవర్గం వైఎస్సార్‌సీపీ పరిశీలకుడు కేవీ సూర్యనారాయణరాజు, క్రెడయ్ విజయనగరం జిల్లా చైర్మన్ వి.పార్థసారథి, అధ్యక్షుడు సూర్యనారాయణ రాజు, కార్యదర్శి కె.రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

### ఇద్దరిపై దాడి కేసు

**సీతంపేట:** మండలంలోని శంబంగి గ్రామానికి చెందిన నిమ్మక కృష్ణ, కొండంగి సింహాచలంపై దాడి చేసిన ఘటనలో ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై జగదీష్‌నాయుడు తెలిపారు. ఈ కేసు వివరాలిలా ఉన్నాయి. బాధితులిద్దరూ సీతంపేట వచ్చి పనులు పూర్తి చేసుకుని ప్రధాన రహదారి పక్కన ఉన్న మెడికల్ షాపు వద్ద మందులు కొనుగోలు చేస్తున్నారు. ఆ సమయంలో మండకాలనీకి చెందిన సవర నాగరాజు, జ్యోతి మోటార్ సైకిల్‌పై వచ్చి మెడికల్ షాపు ముందు ఆపి వేరే షాపు వద్దకు నాగరాజు వెళ్లాడు. జ్యోతి బైక్ పక్కనే నిలబడి ఉండగా ఆ సమయంలో స్థానికులైన శివ, సీహెచ్.చరణ్ వచ్చి తమ బైక్‌కు అడ్డుగా ఉన్న మోటార్‌సైకిల్‌ను ఉన్నపళంగా తీయమని గొడవపడ్డారు. దీంతో మెడికల్ షాపు దగ్గర ఉన్న నిమ్మక కృష్ణ, సింహాచలంలు యువతితో గొడవ పడుతున్న విషయమై అడిగినందుకు శివ, చరణ్‌లు వారిపై దాడి చేయగా గాయాలపాలైన బాధితులను చికిత్స కోసం స్థానిక ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఏఎస్సై సంజీవ్ కేసు నమోదు చేయగా ఎస్సై దర్యాప్తు చేస్తున్నారు.

### ఎస్సీ, ఎస్టీ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఐవీఆర్‌మూర్తి



నియామక పత్రాలతో ఉన్న రాష్ట్ర కమిటీ సభ్యులలో ఐవీఆర్‌మూర్తి

**విజయనగరం అర్బన్:** డాక్టర్ అంబేడ్కర్ జాతీయ ఎస్సీ ఎస్టీ ఫెడరేషన్ రాష్ట్ర కమిటీ ఉపాధ్యక్షుడిగా పట్టణానికి చెందిన ఐవీఆర్‌మూర్తి ఎంపికయ్యారు. రాజ్యాంగ ఆమోద దినోత్సవాన్ని పురస్కరించుకుని ఫెడరేషన్ జాతీయ కమిటీ ఆదివారం న్యూఢిల్లీలో నిర్వహించిన సమావేశంలో రాష్ట్ర కమిటీని ప్రకటించి నియామక పత్రాలను అందజేసింది. ఈ మేరకు ఐవీఆర్‌మూర్తి ఓ ప్రకటన విడుదల చేశారు.

# కొనసాగుతున్న అంతర్‌రాష్ట్ర విలువిద్య పోటీలు

- 13 జిల్లాలనుంచి పాల్గొన్న 600 మంది క్రీడాకారులు



విల్లు ఎక్కు పెట్టిన క్రీడాకారులు

**సీతానగరం:** అంతర్‌జిల్లా విలువిద్య పోటీలు రెండోరోజూ జరుగుతున్నాయని పార్వతీపురం మన్యం జిల్లా విద్యాశాఖ అధికారి ప్రేమ్‌కుమార్ తెలియజేశారు. సీతానగరంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, కేజీబీవీ, గిరిజన ప్రతిభా విద్యాయాల ప్రాంగణాల్లో రెండవరోజు ఆదివారం జరిగిన పోటీలకు హాజరైన ఆయన మాట్లాడుతూ సీతానగరం మండలంలోని జోగింపేట గురుకుల విద్యాలయాల సముదాయంలో 67వ అంతర్‌జిల్లా విలువిద్య క్రీడల పోటీలు అండర్ 14,17, 19 బాలబాలికలకు రెండవ రోజు 'రికర్వ్' విభాగంలో అన్ని వయస్సుల బాలబాలికలకు పోటీలను పూర్తి చేసినట్లు తెలియజేశారు. తదుపరి ఇండియన్ రౌండ్ (వెదురు విల్లులు) విభాగంలో అండర్ 14, 17 బాలబాలికలకు పోటీలను నిర్వహించనున్నట్లు చెప్పారు. సోమవారం ఉదయం ఉదయం 7 గంటలనుంచి ఇండియన్ రౌండ్ అండర్ 19 బాలబాలికలకు అండర్ 14,17, 19 విభాగాల్లో బాలబాలికలకు కాంపౌండ్ విభాగం పోటీలను నిర్వహించాల్సి ఉందన్నారు. విలువిద్య పోటీల్లో పాల్గొనేందుకు వివిధ జిల్లాలనుంచి వచ్చిన 600 మంది బాలబాలికలు వారి ప్రతిభను నిరూపించడానికి ప్రయత్నం చేశారు. కార్యక్రమంలో ఎంఈఓ జి.సూరిదేముడు, స్థానిక విద్యాలయాల పీడీలు, పీఈటీలతో పాటు ఇతర జిల్లాల పీడీలు, పీఈటీలు పాల్గొన్నారు.

# 28న బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలి పర్యటన

- విజయవంతం చేయాలని పార్టీ జిల్లా అధ్యక్షుడి పిలుపు



సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఎన్.ఈశ్వరరావు, తదితరులు

**విజయనగరం టౌన్:** బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలిగా బాధ్యతలు చేపట్టి దగ్గుబాటి పురందేశ్వరి మొట్టమొదటిసారిగా జిల్లాకు ఈ నెల 28న రానున్నారని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు నడికుదిటి ఈశ్వరరావు పేర్కొన్నారు. ఈ సందర్భంగా స్థానిక పార్టీ కార్యాలయంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ ఆ రోజు ఉదయం 10 గంటల నుంచి తోటపాలెంలోని సాయిబాలాజీ ఫంక్షన్ హాల్‌లో పోలింగ్‌బూత్ కమిటీలు, శక్తి కేంద్ర ప్రముఖులతో సమావేశం ఉంటుందన్నారు. తొలుత జిల్లా కేంద్రానికి చేరుకున్న ఆమెకు వీటీ అగ్రహారం వైజంక్షన్ నుంచి భారీ గజమాలతో స్వాగతం పలికి మూయారి జంక్షన్, రైల్వేస్టేషన్ రోడ్డు, ఎన్‌సీఎస్ సినిమా హాల్, కన్యకాపరమేశ్వరి కోవెల, గంటస్తంభం మీదుగా ర్యాలీగా వచ్చి పైడితల్లి ఆలయంలో అమ్మవారి దర్శనం చేసుకుంటారన్నారు. అనంతరం కోట వద్ద ఉజ్వల గ్యాస్ లబ్ధిదారులకు గ్యాస్ కనెక్షన్‌లు అందజేస్తారని చెప్పారు. దర్శనానంతరం లయన్స్ క్లబ్ మీదుగా బాలాజీ జంక్షన్, ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి తోటపాలెం మీదుగా సాయి బాలాజీ ఫంక్షన్ హాల్‌కు భారీ ర్యాలీ చేరుతుందన్నారు. పార్టీ అభిమానులు, కార్యకర్తలు ర్యాలీలో పాల్గొని పర్యటనను విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో పార్టీ రాష్ట్ర నాయకులు బవిరెడ్డి శివప్రసాదరెడ్డి, జిల్లా కార్యదర్శి మన్నెం సురేష్, మజ్జి రమేష్‌బాబు, యువమోర్చా జిల్లా అధ్యక్షుడు పిల్లా నవీన్‌కుమార్, ప్రధాన కార్యదర్శి మన్నెం శ్యామ్ సుందర్, ఇప్పిలి గోపాలకృష్ణ, సంబర లక్ష్మీనరసింహం, గొలగాన రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యాప్రమాణాల పేరిట వేధింపులు తగవు



మాట్లాడుతున్న యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రెడ్డి మోహనరావు

**విజయనగరం అర్బన్:** గ్రామీణ ప్రాంతాల్లో అసమానంగా ఉండే విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను శతశాతం సాధించడం వీలుకాదని, ఈ పరిస్థితుల్లో విద్యాప్రమాణాల పేరుతో ఉపాధ్యాయులను వేధించడం సరికాదని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రెడ్డి మోహనరావు అన్నారు. ఈ మేరకు స్థానిక జెడ్పీ సమావేశ మందిరంలో ఆదివారం జరిగిన జిల్లా యూటీఎఫ్ 49వ కౌన్సిల్ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో విద్యార్థులపై తల్లిదండ్రుల అక్షర పరిజ్ఞాన ప్రభావం ఉంటుందని, దీని వల్ల తరగతి గదిలో అందరూ ఒకే సామర్థ్యంతో ఉండరని స్లో లెర్నర్స్ అధికంగా ఉంటారన్నారు. తరగతి గదిలో శతశాతం మందిని కాకుండా విద్యార్థుల సంఖ్యలో పరిమిత శాతం మందిని నిర్దేశించి వారి విద్యాప్రమాణాలను మాత్రమే పర్యవేక్షణలోకి తీసుకునేలా పరిగణించాలని కోరారు. ప్రాథమిక పాఠశాలలను నిర్వీర్యం చేస్తున్న జీవో 117 ను రద్దు చేయాలని సమావేశంలో డిమాండ్ చేశారు. సమావేశంలో యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జేఏవీఆర్‌కే ఈశ్వరరావు, కార్యదర్శి నివేదికను ప్రవేశ పెట్టారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారి యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.రవీంద్ర, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కె.విజయగౌరి, రాష్ట్ర నాయకులు డి.రాము, కె.శ్రీనివాసరావు, జిల్లా గౌరవ అధ్యక్షుడు ఎ.సత్యశ్రీనివాసరావు, సహాధ్యక్షులు వి.ప్రసన్నకుమార్, జి.పార్వతి, కోశాధికారి సీహెచ్ భాస్కరరావు, యూటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్స్ ఎం.అప్పలనాయుడు, జి.పద్మావతి, కె.అప్పారావు, జిల్లా కార్యదర్శులు కె.ప్రసాదరావు, సీహెచ్ తిరుపతినాయుడు, పి.త్రినాథ్, వాసుకేశవ, రాధాభవాని, శ్రీదేవి, జీవీరమణ, రాజారావు, ఎస్ సత్యనారాయణ, ఎ.శంకరరావు, సీపీఎస్ కమిటీ కన్వీనర్ పి.రామ్‌ప్రసాద్, వివిధ మండలాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# జైలు సిబ్బంది ఔదార్యం



ప్రమాదానికి గురై కోలుకున్న వార్డర్ రాజేష్‌కు సాయం అందిస్తున్న జైలు అధికారులు, సిబ్బంది

**ఆరిలోవ:** విశాఖ కేంద్ర కారాగారం సిబ్బంది ఆపదలో ఉన్న తోటి ఉద్యోగికి ఆర్థిక సాయం అందించి తమ ఔదార్యం చాటుకున్నారు. బొబ్బిలి సబ్ జైల్‌లో వార్డర్‌గా పని చేస్తున్న జి.రాజేష్ ఇటీవల ద్విచక్ర వాహనంపై భార్యతో కలసి ప్రయాణిస్తుండగా రోడ్డు ప్రమాదానికి గురై విశాఖ హెల్త్ సిటీ పినాకిల్ ఆస్పత్రిలో చికిత్స పొందారు.

వైద్య ఖర్చులు సుమారు రూ.4 లక్షల వరకు అయ్యాయి. రాజేష్ గతంలో విశాఖ కేంద్ర కారాగారంలో వార్డర్‌గా పని చేశారు. కొన్నాళ్ల క్రితం బొబ్బిలి సబ్ జైల్‌కు బదిలీ అయ్యారు. ప్రమాదం విషయం తెలుసుకున్న విశాఖ కేంద్ర కారాగారంతో పాటు ఈ పరిధిలో ఉన్న శ్రీకాకుళం, విజయనగరం జిల్లా జైళ్లు, సబ్ జైళ్ల సిబ్బంది తలా ఓ చేయి వేశారు. మొత్తం రూ.1.89 లక్షలు సేకరించారు. ఈ నగదును రాజేష్‌కు ఆదివారం విశాఖ కేంద్ర కారాగారంలో పర్యవేక్షణాధికారి ఎస్.కిశోర్‌కుమార్, అదనపు పర్యవేక్షణాధికారి ఎం.వెంకటేశ్వర్లు, డీఎస్‌లు రామచంద్రరావు, కమలాకరరావు, సిబ్బంది అందజేశారు. తనకు ఆర్థిక సహాయం అందించిన అధికారులు, సిబ్బందికి రాజేష్ కృతజ్ఞతలు తెలిపారు.

విశాఖ పరిపాలన రాజధానితో

# ఉత్తరాంధ్ర అభివృద్ధి



సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు

- డిసెంబర్ నుంచి విశాఖ వేదికగా పాలనకు శ్రీకారం
- అన్ని ప్రాంతాల అభివృద్ధే అభిమతంగా మూడు రాజధానుల నిర్ణయం
- ఉత్తరాంధ్ర అభివృద్ధిని అడ్డుకుంటున్న టీడీపీ, జనసేన పార్టీలు
- 2024 ఎన్నికల ప్రజాక్షేత్రంలో ప్రతిపక్షాలకు గుణపాఠం తప్పదు
- జెడ్పీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు

**విజయనగరం:** విశాఖ పరిపాలన రాజధానిగా రూపాంతరం చెందడంతో ఉత్తరాంధ్ర అభివృద్ధి సాధ్యపడుతుందని, అన్ని ప్రాంతాల అభివృద్ధే తన అభిమతంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తీసుకున్న నిర్ణయాన్ని ఈ ప్రాంత ప్రజలంతా స్వాగతిస్తున్నారని విజయనగరం జెడ్పీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు పేర్కొన్నారు. డిసెంబర్ నుంచి విశాఖ వేదికగా పాలన వ్యవహారాలు ప్రారంభం కానున్నట్టు తెలిపారు. ఆదివారం జిల్లా పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. భారత రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ స్ఫూర్తితో రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలు సమానంగా అభివృద్ధి చెంది, అన్ని వర్గాల ప్రజలకు సమాన హక్కులు కల్పించటం ద్వారా సమ సమాజ స్థాపన కోసం ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారన్న విషయాన్ని ప్రతి ఒక్కరు గుర్తించాలన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అభివృద్ధి చేసుకున్న హైదరాబాద్ నగరాన్ని దగా చేసి దూరం చేసిన సందర్భం మరోసారి ఉత్పన్నం కాకూడదన్న ఉద్దేశంతో మూడు రాజధానుల నిర్ణయాన్ని తీసుకున్నారని చెప్పారు. ఉత్తరాంధ్ర ప్రాంత వాసిగా ఈ ప్రాంతానికి జరుగుతున్న మంచిని, న్యాయాన్ని అడ్డుకునేందుకు కొంతమంది చేస్తున్న దుశ్చర్యలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. న్యాయపరమైన చిక్కులను అధిగమిస్తామన్నారు. ఉత్తరాంధ్ర ప్రాంత వాసిగా ఉన్న టీడీపీ పార్టీ అధ్యక్షుడు అచ్చెన్నాయుడు ఈ ప్రాంతానికి అన్యాయం చేస్తు న్నారని మండిపడ్డారు. ఈ ప్రాంత వాసులు ఓట్లతో గెలిచి అధికారాన్ని అనుభవిస్తున్న అచ్చెన్నాయుడు పరిపాలన రాజధానిని వ్యతిరేకించి ప్రజల నోట్లో మట్టికొట్టొద్దని సూచించారు. సహజవనరులున్న ఉత్తరాంధ్ర అభివృద్ధికి ముఖ్యమంత్రి పెద్దపీట వేయటం పట్ల విజయనగరం, విశాఖ, శ్రీకాకుళం జిల్లాల ప్రజలు, ప్రజా సంఘాలు హర్షిస్తుంటే జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ అడ్డుకునేందుకు ప్రయత్నించటం మంచి పద్ధతి కాదని హితవు పలికారు. ఉత్తరాంధ్ర ప్రజలకు అన్యాయం చేయొద్దని పేర్కొన్నారు. విశాఖలో పరిపాలన రాజధానిని అడ్డుకుంటే 2024 జరగబోయే ఎన్నికల్లో ప్రజా క్షేత్రంలో టీడీపీ, జనసేన పార్టీలకు తగిన గుణపాఠం తప్పదని హెచ్చరించారు.

### చెల్లూరులో వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర



చెల్లూరులో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న జెడ్పీ సీఈఓ రాజ్‌కుమార్

**విజయనగరం రూరల్:** మండలంలోని చెల్లూరు గ్రామంలో ఆదివారం వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన జెడ్పీ సీఈఓ కె.రాజ్‌కుమార్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ పథకాలకు సంబంధించిన సమాచారం మొత్తం ఈ యాత్రల్లో భాగంగా ప్రజలకు వివరించ డం జరుగుతుందన్నారు. ఆయా పథకాలు అందుకోలేని లబ్ధిదారులను గుర్తించి అర్హులకు పథకాలు అందిస్తారని తెలిపారు. యాత్రలో బ్యాంకుల ప్రతినిధులు పాల్గొని వివిధ కేంద్ర పథకాల కింద రుణ మంజూరు పత్రాలు జారీ, లబ్ధిదారులతో ముఖా ముఖి నిర్వహిస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ గంటా వెంకటరా వు, సర్పంచ్ కె.ఆదినారాయణ, మండల శాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు

**వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర షెడ్యూలు**

వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర ఈ నెల 25 నుంచి ఆరు మండలాల్లో ప్రారంభించగా, మిగతా మండలాలకు షెడ్యూలు విడుదల చేసినట్టు జిల్లా నోడల్ అధికారి కె.రాజ్‌కుమార్ తెలిపారు. డిసెంబరు 5న సంతకవిటి, 6న డెంకాడ, 8న వేపాడ, 9న గుర్ల, 12న మెరకముడిదాం, 13న బొండపల్లి, 19న పూసపాటిరేగ, 22న రేగిడి ఆమదాలవలస, ఎల్.కోట, 27న తెర్లాం, గజపతినగరం, 30న గరివిడి మండలాల్లో ఈ కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు.

# లారీ ఢీకొని యువకుడి దుర్మరణం



తీవ్రగాయాలతో అపస్మారక స్థితిలో నరేష్



మృతుడు దుర్గారావు (ఫైల్)

**పాలకొండ రూరల్:** మండలంలోని అన్నవరం గ్రామ సమీపంలో ఆదివారం సాయంత్రం లారీ ఢీకొట్టడంతో పట్టణ పరిధిలోని ఎస్‌కే.రాజపురానికి చెందిన జడ్డు రామినాయుడు, రమణమ్మ దంపతుల రెండవ కుమారుడు దుర్గారావు (24) దుర్మరణం చెందాడు. భవన నిర్మాణ కార్మికుడిగా పనిచేస్తున్న దుర్గారావు విధులు పూర్తి చేసుకుని స్నేహిడుతు కడగల నరేష్‌తో కలిసి ద్విచక్ర వాహనంపై పాలకొండ వస్తుండగా పొందూరుకు చెందిన లారీ బైక్‌ను ఢీకొట్టడంతో ఇద్దరూ రోడ్డుపై పడిపోయారు. దీంతో బైక్ వెనుక కూర్చున్న దుర్గారావు తలపై నుంచి వాహనం నడుపుతున్న నరేష్ రెండు కాళ్లపై నుంచి లారీ వెళ్లిపోయిందని స్థానికులు చెబుతున్నారు. ఘటనా స్థలంలో దుర్గారావు మరణించగా క్షతగాత్రుడైన నరేష్ పరిస్థితి ఆందోళన కరంగా ఉండడంతో శ్రీకాకుళం తరలించారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదంపై ఆరా తీశారు. లారీ డ్రైవర్ పరారీలో ఉండడంతో ఎస్సై బి.శివప్రసాద్ కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా ఆస్పత్రికి తరలించారు.

**చికిత్స పొందుతూ ఇద్దరు..**

**భోగాపురం:** పురుగు మందు తాగి అపస్మారక స్థితి లో ఉన్న మండలంలోని రాజాపులోవ గ్రామానికి చెందిన ఉప్పాడ నూకరాజు(40) విజయనగరం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ, రోడ్డు ప్రమాదంలో గాయపడిన పూసపాటిరేగ మండలం పొలంగి గ్రా మానికి చెందిన కోలా మోహనరావు(30) విశాఖ లోని కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందారు. ఈ మేరకు ఎస్సై కృష్ణమూర్తి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. రాజాపులోవ గ్రా మానికి చెందిన నూకరాజు ఆటో నడుపుకుంటూ కుటుంబంతో జీవనం సాగిస్తున్నాడు. ఈమధ్య కాలంలో నూకరాజు మద్యానికి బానిసై ప్రతిరోజూ ఇంటికి తాగి వస్తుడడంతో తరచూ భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతుండేవి. ఈక్రమంలో ఈనెల 22న నూకరాజు భార్య యల్లయ్యమ్మ కుమారుడిని తీసుకుని భీమసింగిలో ఉన్న బంధువులు ఇంటికి ఫంక్షన్‌కు వెళ్లింది. అదే రోజు నూకరాజు ఇంట్లో ఉన్న వ్యవసాయానికి వాడే పురుగుల మందు తాగేసి అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయాడు. చుట్టుపక్కల వారి ద్వారా ఈ సమాచారం అందుకున్న భార్య రాజాపులోవ చేరుకుని అపస్మారక ఉన్న భర్తను విజయనగరం ఆస్పత్రికి తరలించింది. అలాగే పూసపాటిరేగ మండలం పొలంగి గ్రామానికి మోహనరావు ప్రైవేట్ కంపెనీలో ఫిట్టర్‌గా పనిచేస్తూ కుటుంబంతో జీవనం సాగిస్తున్నాడు. ఈనెల 14న డెంకాడ మండలం బంటుపల్లి గ్రామంలో ఉంటున్న అక్క బమ్మిడి రా ములమ్మను చూసేందుకు బైక్‌పై వెళ్లాడు. అక్కను చూసుకుని తిరిగి హైవేపై సర్వీస్ రోడ్డులో తగరపువలస బయల్దేరాడు. మార్గమధ్యంలో అవనాం బ్రిడ్జి వద్ద బైక్ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టి తీవ్రగాయాల పాలయ్యాడు.

స్థానికుల ద్వారా ఈ సమాచారం అందుకున్న కుటుంబసభ్యులు వచ్చి 108 వాహనంలో విశాఖపట్నం కేజీహెచ్‌కు తరలించారు.